క్లుప్తంగా

బ్యాంకు ఖాతాలకే పింఛన్ల సొమ్ము జమ

కడియం: లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే మే నెల పింఛన్ల సొమ్ము జమ అవుతాయని ఎంపీడీవో జి.రాజీమనోజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పింఛన్ల పంపిణీపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం అధిక శాతం మంది పింఛను దారులకు వారి బ్యాంకు ఖాతాలకే సొమ్ములు జమవుతాయన్నారు. ఖాతాలకే జమ కానివారికి ఇంటింటికీ వెళ్లి అందించేందుకు కార్యాచరణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. 3,358 మంది దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికే వెళ్లి పెన్షన్ అందిస్తారన్నారు. పింఛనుదారులు సచివాలయం వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు.

రవాణా కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ: మోటారు రవాణా కార్మికుల సంక్షేమానికి రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని రవాణా కార్మికుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల తర్వాత అనేక మంది రవాణా రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. డ్రైవర్లు, మెకానిక్‌లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, టైర్లు ఫిటింగ్ చేసేవారు, పెట్రోల్ బంకులో పనిచేసేవారు, ఆటోమొబైల్లో పనిచేసేవారు, లారీ క్లీనర్లను రవాణా రంగ కార్మికులుగా గుర్తించాలన్నారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జేఏసీ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పి.ఆదినారాయణ, లారీ యూనియన్ అధ్యక్షుడు కొత్తపల్లి వీరభద్రరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నార్గన వసంత కుమార్, కోశాధికారి వెన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రావతి మృతికి సంతాపం

కడియం: వైఎస్సార్ సీపీ నాయకుడు, కడియపుసావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు మాతృమూర్తి చంద్రావతి మృతికి మంత్రి చెల్లుబోయిన వేణు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం కడియపుసావరంలో సూరిబాబు, కుటుంబ సభ్యులను వేణు పరామర్శించారు. ముందుగా చంద్రావతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరివేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొమ్మూరు గ్రామపంచాయతీ వీధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన సీహెచ్ స్వర్ణ (25) బొమ్మూరులోని బేయర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ బొమ్మూరు పంచాయతీ వీధిలోని అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటోంది. ఆమెతో పనిచేసే ఉద్యోగిని సోమవారం రాత్రి స్వర్ణ ఉంటున్న ఫ్లాట్‌కు వచ్చి చూడగా, చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయిఉంది. ఈ విషయాన్ని బొమ్మూరు పోలీసులకు తెలపగా, ఎస్సై అంకారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్వర్ణ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తల్లిదండ్రులు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ప్రజల సంక్షేమమే మా లక్ష్యం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీనివాస్, భరత్‌రామ్
- జోరుగా ఎన్నికల ప్రచారం


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్


బొమ్మూరు కొత్తపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ పాలన నిరంతరాయంగా కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని 44, 47, 48 డివిజన్లలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భరత్‌రామ్ మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పాలనను అన్ని వర్గాల ప్రజలు స్వాగతించారన్నారు. కుల, మత, వర్గ, పార్టీ రహితంగా పేదరికమే అర్హతగా లబ్ధిదారులను సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల బంధువులు, అనుచరులకు మాత్రమే లబ్ధి అందేదన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులకు లంచాలు ఇస్తేనే పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేసేవారన్నారు. టీడీపీ పాలనలో నగరానికి చేసిందేమీ లేదన్నారు. దాదాపు 16 ఏళ్ల పాటు ఆ పార్టీకి చెందిన ఆదిరెడ్డి కుటుంబం వివిధ పదవులు పొందారని ఒక్క అభివృద్ధి పనికూడా చేయలేదన్నారు. తాను ఎంపీగా కేవలం రెండు, రెండున్నర సంవత్సరాలలో నగరాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశానో ప్రజలందరికీ తెలుసునన్నారు. మీ అందరి ఆశీస్సులు, మద్దతుతో సిటీ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నగరాన్ని అభివృద్ధిలో మరింత పరుగులు పెట్టిస్తానన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ చెప్పింది చెప్పినట్టుగా జగనన్న చేస్తారన్నారు. చెప్పింది చేయని వ్యక్తిగా చంద్రబాబు నాయుడు నిలిచారన్నారు. జగనన్న అంటే నిజం, చంద్రబాబు అంటే మోసం అని ధ్వజమెత్తారు. జగనన్నకు సంపూర్ణ మద్దతిచ్చి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జులు అర్జరపు వాసు, చోడిశెట్టి సత్యవాణి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్ పాల్గొన్నారు.

కూటమి మోసగాళ్లకు బుద్ధి చెప్పండి : మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో కూటమి మోసగాళ్లకు బుద్ధిచెప్పాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బొమ్మూరులోని కొత్తపేట, బొమ్మూరు జంక్షన్ నుంచి రాజవోలు రోడ్డు, పాత బొమ్మూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల కోసం సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను పంపిణీ చేశారు.

మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన నవరత్నాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టో ఆ నవరత్నాలకు మించి ఉందని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే అంశాలనే చేర్చడం జరిగిందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆయన ఎన్ని కవ్వింపు మాటలను, బూటకపు హామీలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్షంలో కన్నీళ్లు, అధికారంలోకి వస్తే బెదిరింపు ధోరణిలో చంద్రబాబు వ్యవహార శైలి ఉంటుందన్నారు. ఏది ఏమైనా ప్రజలందరూ జగన్ వైపు ఉన్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి, జగన్‌ను మరోసారి సీఎం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి గెలిపించాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, ముద్దాల అను, మత్సేటి శివ, చెల్లయమ్మ, యెనుముల త్యాగరాజు, తోడేటి రాజా, సోమన శ్రీను, మాలేటి రమేష్, కేవీ సుబ్బారెడ్డి, సద్గుణ రామారెడ్డి, షేక్ సమీరా, నాగులపల్లి ఆశ, వైఎస్ కుమార్, పరిమళ నాని, తోడేటి రాహుల్ పాల్గొన్నారు.

జగన్ పాలనకు అన్ని వర్గాల ఆదరణ


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అన్ని వర్గాల ఆదరణ లభిస్తోందని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన పసల సత్తిబాబు, ఆయన మిత్ర బృందం పసల గంగరాజు, పసల సూర్యచంద్ర రావు, దాసరి విష్ణు, రేలంగి రాజు, కొయ్యన సత్య శ్రీమన్నారాయణ, గండిబోయిన రమేష్, పిల్లి విక్కీ, కె వీరన్న, ఎస్‌కే అక్బర్, పెద్దింటి శివ, దుబసి కోటేశ్వరరావు, లక్కవరపు తరుణ్ కుమార్, వల్లిరెడ్డి శివ, కొండమూరి సత్తిబాబు, అధిక సంఖ్యలో మహిళలు వైఎస్సార్ సీపీలో చేరగా వారికి మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న పాలనలో కుటుంబంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలన్న, ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు చేరాలన్నా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికలలో సిలింగ్ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రేలంగి పెద్ద సత్యనారాయణ, వేముల ఏసుబాబు, ఎంపీవీ సత్యనారాయణ, బొమ్మ శ్రీను, బత్తిన అప్పారావు, గొర్రెల రమణ, సూరంపూడి సుబ్రహ్మణ్యం, పుచ్చా గోవింద రెడ్డి బ్రదర్స్, రుంకాని రవి కుమార్, గుబ్బల బాల, దండంగి ప్రభు, వడిసిల నారాయణ పాల్గొన్నారు.

కలసికట్టుగా బీసీల ఐక్యత చాటుదాం


ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సంఘీయులు

రాజమహేంద్రవరం సిటీ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో బీసీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి, బీసీల సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని శెట్టిబలిజ, గౌడ సామాజిక వర్గ నాయకులు పిలుపు నిచ్చారు. నగరంలోని లాలా చెరువు హోండా షోరూమ్ సమీపంలో సోమవారం శెట్టిబలిజ గౌడ ఆత్మీయ కలయిక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. బీసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. సమాజంలో గౌరవం, రాజకీయంగా ప్రోత్సాహం, ఆర్థికంగా సహకారం ఇస్తూ భుజం తట్టి ప్రోత్సహిస్తున్న జగనన్న వెంటే బీసీ సామాజిక వర్గీయులందరూ ఉండాలని పిలుపు నిచ్చారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలందరిపైనా ఉందన్నారు.

పెద్ద కొడుకుగా సేవలందిస్తా : భరత్‌రామ్

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ ఇంటి పెద్ద కొడుకునై సేవలందిస్తానన్నారు. ఎంపీగా నగరానికి చేసిన అభివృద్ధిని వివరించారు. పార్లమెంట్, సిటీ, రూరల్ నియోజకవర్గాలలో బీసీ అభ్యర్థులను ఎన్నికల బరిలో జగనన్న నిలబెట్టారంటే, మన ఐక్యతపై ఆయనకు ఉన్న నమ్మకమన్నారు. దానిని వమ్ము చేయకుండా ముగ్గురినీ గెలిపించాలన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టానన్నారు. వైఎస్సార్ ఆశయాలు, జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు తగ్గట్టుగా ప్రజాసేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు మాజీ కార్పొరేటర్లు గుత్తుల మురళీధర్, మార్గాని నాగేశ్వరరావు, వాసంశెట్టి గంగాధర్, పాలిక శ్రీనివాస్, కడలి వెంకటేశ్వరరావు, గుత్తుల వీరబ్రహ్మం, గూడూరి రాధిక పాల్గొన్నారు.

మళ్లీ ఫ్యాన్‌దే హవా.. కూటమికి ఓటమే

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- కడియపులంకలో ఎన్నికల ప్రచారం


కడియపులంకలో ఓటర్లకు నమస్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ ఫ్యాన్ గాలి వీయడం ఖాయమని, ఆ ప్రభంజనానికి కూటమికి ఓటమి తప్పదని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియపులంకలోని దళితవాడ, దోసాలమ్మ కాలనీలో సోమవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఫ్యాన్ గుర్తుకి ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి, జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జగన్‌కు ఓటువేస్తే అన్ని పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబుకు ఓటు వేస్తే ఆగిపోతాయన్నారు. గతంలో ఇదే కూటమి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు కూడా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి ఇల్లూ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందిందని, మీ కుటుంబానికి మేలు జరిగింది అని అనుకుంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. గూడూరి భారతీరామ్, యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, తిరుమలశెట్టి శ్రీను, తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, బత్తుల రాము, గిరిజాల బాబు, వీరభద్రయ్య, ఆరేటి వెంకట్రావు, ఉటూకూరి శైలజ, ఆకుల వెంకన్న, తిరుమలశెట్టి వాసు, కొత్తపల్లి శివాజీ, సలాది ప్రసాద్, చెల్లుబోయిన చంద్రరావు, ఆకుల సుధాకర్, మాసరయ్య, ముత్యం జగదీష్, గాద సాయి, పంతం తాతాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఎన్డీయే కూటమిని తరిమికొడదాం
- మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు


సమావేశంలో మాట్లాడుతున్న కనకరావు

సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీయే కూటమిని ఓడించాలని, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు పిలుపు నిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలను నిజానికి అబద్ధానికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్యానించారు. చంద్రబాబు అబద్ధాలకు, సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన సంక్షేమానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు జగన్ వైపు ఉంటారన్నారు. సిటీ ఎమ్మెల్యేగా మార్గాని భరత్‌రామ్, రూరల్ ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణు, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు, మహిళలకు సామాజిక న్యాయం అందించారన్నారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమైందన్నారు. చంద్రబాబు పాలనలో దళితులు, అణగారిన వర్గాలకు అవమానం జరిగిందన్నారు. జగన్ పాలనలో దళితులు, బీసీలు, మహిళలకు పెద్దపీట వేశారని, మంత్రివర్గంలో ఎస్సీ, బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ప్రజలను మోసం చేయడానికి వస్తున్న ఎన్డీయే కూటమితో జాగ్రత్తగా ఉండాలన్నారు. మాదిగ వర్గీకరణ ముసుగులో మాదిగలను మంద కృష్ణ బానిసలుగా చేస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరికే వరప్రసాద్, లిడ్ కేప్ రాష్ట్ర డైరెక్టర్ తగరం సురేష్ బాబు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి చింతపర్తి రాంబాబు, మాదిగ ఐక్య వేదిక అధ్యక్షుడు పలివెల జనార్దన్, ఈతకోట బాపన సుధారాణి పాల్గొన్నారు.

భరత్‌రామ్ విజయం కోసం ప్రార్థనలు


ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సిటీ ఎమ్మెల్యేగా మార్గాని భరత్ రామ్ విజయాన్ని కాంక్షిస్తూ క్రైస్తవులు సోమవారం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంపీగా భరత్‌రామ్ క్రైస్తవుల దీర్ఘకాలిక సమస్య అయిన శ్మశాన వాటికకు తగిన స్థలాన్ని కేటాయించడమే కాకుండా, పలు రకాలుగా క్రైస్తవుల సమస్యలను పరిష్కరించారు. ఈ నేపథ్యంలో నగరంలోని క్రైస్తవులు ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రెవరెండ్ ప్రార్థన కుమార్ ఆధ్వర్యంలో లూథర్ గిరి చర్చిలో, మల్లికార్జున నగర్‌లోని పాస్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో చర్చి ఆఫ్ వర్షిప్ సెంటర్, రెవరెండ్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో ట్రినిటీ చప్పెల్, రత్నంపేటలోని ఆథోనీ వర్షిప్ ప్రార్థనాలయంలో గుల్లా మార్టిన్, రక్షణాలయంలో మార్టిన్ లూథర్, షాలోమ్ చర్చిలో షాలోమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విచ్చేసిన మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు బృందం సోమవారం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ పరిధిలో చేపట్టిన పర్యటన వివరాలను వివరించారు. రాష్ట్ర ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ తగరం సురేష్‌బాబు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి పెరికే వరప్రసాద్, జనార్దన్ పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల హర్షం

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్ సంక్షేమ పథకాలపై రాష్ట్రంలో ప్రజలందరూ నూరుశాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత తెలిపారు. బొమ్మూరు వడ్డీ వీరభద్రనగర్‌లో సోమవారం బీసీ కులాల మహిళలను కలిశారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. డాక్టర్ అనసూరి పద్మలత మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో 17 శాతానికి పెరిగిన స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ), 12 శాతం నుంచి 4.2 శాతానికి తగ్గిన పేదరికం సీఎం జగన్ విజయవంతమైన పాలనకు, రాష్ట్ర ఆర్థిక పురోగతికి నిదర్శనమన్నారు. ఇటీవల సీఎం జగన్ విడుదల చేసిన మ్యానిఫెస్టో అన్ని వర్గాలకూ మేలు చేస్తుందన్నారు. చంద్రబాబు అండ్ కో అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించేందుకు వస్తారని, అటువంటి వారిని ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణు, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు.


రూరల్ బరిలో ఏడుగురు అభ్యర్థులు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం బరిలో ఏడుగురు అభ్యర్థులు నిలిచారని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.తేజ్ భరత్ తెలిపారు. ఆ వివరాలను, వారికి కేటాయించిన గుర్తులను వెల్లడించారు. వైఎస్సార్ సీపీకి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు సీలింగ్ ఫ్యాన్, తెలుగుదేశానికి చెందిన గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సైకిల్, కాంగ్రెస్ కు చెందిన బాలేపల్లి మురళీధర్‌కు హస్తం గుర్తులను కేటాయించారు.

ఆర్ట్స్ కళాశాల.. అరకు కాఫీ

- విద్యార్థులే నిర్వాహకులు
- ఎర్న్ వైల్ లెర్న్‌లో భాగంగా ఏర్పాటు
- మంచి కాఫీలాంటి కాన్సెప్ట్


అరకు కాఫీ హౌస్ నిర్వహిస్తున్న విద్యార్థులకు చెక్కు పంపిణీ చేస్తున్న కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ (ఫైల్)



విద్యార్థులు తయారు చేసి అందిస్తున్న అరకు కాఫీ

కంబాలచెరువు: చదువుకుంటూ సంపాదించడం అనే కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులతో అరకు కాఫీ స్టాల్‌ను నిర్వహింపజేస్తోంది. ఎర్న్ వైల్ లెర్నింగ్ కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని అరకు బేవరేజెస్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుని కళాశాల ఆవరణలో అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కాఫీ అరకు లోయలోని గిరిజన మహిళలు రూపొందించిన సున్నితమైన రుచికి ప్రసిద్ధి చెందింది. అంతేకాక ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగిన ప్రిక్స్ ఎపిక్యుర్స్ లేదా 2018 అవార్డులో ప్రతిష్ఠాత్మకమైన గోల్డ్ మెడల్, ఐక్యరాజ్యసమితి నుంచి ప్రశంసలతో పాటు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకుంది. ఈ విధంగా ఏర్పాటు చేసిన అరకు కాఫీ కేఫ్‌ను కళాశాలలోని విద్యార్థులే నిర్వహిస్తారు.

విద్యార్థులకు లాభాల వాటా

కాఫీ స్టాల్‌లో వచ్చిన లాభాలలో 50 శాతం విద్యార్థులకు చెల్లిస్తారు. మిగిలిన లాభాలను పేద విద్యార్థుల సంక్షేమ నిధిలో జమ చేస్తారు. వారానికి మూడు షిఫ్టులలో అరకు కాఫీ షాపును నిర్వహిస్తూ విద్యార్థులు ఉపాధి అవకాశాన్ని పొందేలా షెడ్యూల్ రూపొందించారు. క్యాంటీన్ కమిటీ నిర్దేశించబడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లతో మార్గనిర్దేశం చేస్తున్నారు. విద్యార్థులందరూ తమ విద్యా కార్యకలాపాలను నిరంతరాయంగా కొనసాగిస్తూ, వ్యాపారంలో అనుభవం సంపాదిస్తున్నారు. వారంలో ఆరుగురు విద్యార్థులకు కాఫీ హౌస్‌ను నిర్వహించే బాధ్యత అప్పగించారు. క్యాంటీన్ కమిటీ ప్రతిరోజు విక్రయాలను ఫ్రాంచైజర్‌కు నివేదిస్తారు.


కాఫీ విక్రయాలకు ప్రోత్సాహం

కాఫీ విక్రయాలను ప్రోత్సహించేందుకు ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం వాకర్స్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ కళాశాలను సందర్శించారు. అరకు కాఫీ హబ్‌లో విజయవంతంగా పనిచేసిన విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేసి, కాఫీ విత్తనాలను పాడిగా మార్చే యంత్రాన్ని బహూకరించారు. పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్, ఆయన భార్య సంస్కృతి చౌహాన్ అరకు కాఫీ హౌస్‌ను సందర్శించి, విద్యార్థుల సేవలను కొనియాడారు.

స్పాన్సర్లతో హాస్టల్ విద్యార్థులకు పంపిణీ

అరకు కాఫీని స్పాన్సర్డ్ కాఫీ అనే కాన్సెప్ట్‌తో హాస్టల్‌లో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఇప్పటి వరకూ హాస్టళ్లకు 50 స్పాన్సర్డ్ కాఫీలు ఉచితంగా ఇస్తున్నారు. స్పాన్సర్ల వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేశారు.

ఎంతో ప్రయోజనం



విద్యార్థులు చదువుకుంటూనే వ్యాపారంలో మెళకువలు తెలుసుకునేలా అరకు కాఫీ హౌస్‌ను కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశాం. మా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఎర్న్ వైల్ లెర్న్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, వాటిని విస్తరించాలనే లక్ష్యంతో ఉన్నాం. ఆ దిశగా చర్యలు చేపట్టాం. అరకు కాఫీ హౌస్‌ను విద్యార్థులు చాలా చక్కగా నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ కె.రామచంద్రరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, రాజమహేంద్రవరం

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కంబాలచెరువు: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని, ఉత్తీర్ణత చెందని విద్యార్థులకు బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నర్సింహం తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ విద్యార్థులందరూ ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాలన్నారు. మే నాలుగో తేదీ వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.